
# తండ్లాట



సందెడు ఎండిన గడ్డిని ఎడ్ల ముందు వేస్తూ వాటి వైపు జాలిగా చూసాడు రాములు. అవి ఆవురావురంటూ ఎండుగడ్డిని అందుకున్నాయి. బలంగా కండపట్టి కాలు దువ్వి రంకెలు గొట్టే ఎడ్లు, ఇరవై బస్తాల వడ్లను అవలీలగా మోసుకొచ్చే ఎడ్లు. గడ్డి సరిగాలేక ఓసర లేనట్లు చిక్కిపోయినాయి. పక్క బొక్కలు తేలి తోలు ముడుతలు పడ్డది.

"నీ మంకు నీదే! ఒకరు చెప్పితే వినవు. నీది నీకు తెలువది. ఇంకా వానలు పడుతయనుకుంటున్నవా! ఉత్తెర జూసి ఎత్తురగంప అన్నరట. ఉత్తెర దాటింది. చెరువు నిండది. పంటలు పండయి. ఎడ్లను అమ్మ్. మా చెల్లె దగ్గరికి పట్నం బోదాం. ఏదన్న కంపినిల పని జూపిత్తరు" పొద్దుగల్ల భార్య చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి రాములుకు. గుండె బరువెక్కి కండ్లల్ల నీళ్ళు తిరిగినయి.

"ఇదే ఆఖరి గడ్డి మోపు. రెండు మూడు రోజులాగితే ఈ గడ్డి కూడా దొరకదు. వాగులో గరుక ఏర్లు తవ్వాల్సిందే! ఈ ఏడన్నా చెరువు నిండుతదనుకుంటే సాలయ్యే వానలే లేకపాయె. ఎడ్లను అప్పుడే అమ్ముదామంటే మనసొప్పకపాయె. ఇప్పుడు అమ్ముదామంటే సగందర కూడా ఎవడు పెట్టడు మనసులో అనుకుంటూ ఎడ్లను ఆర్తిగా తడిమాడు రాములు.

'వానలు పడేకాలం దాటిపోయింది. ఇప్పుడెట్లా.....? ఈ బాకీలు ఎట్ల తీరాలె. కడుపుకు ఎట్ల బతుకాలె! అని ఆలోచన రాగానే మనసు మరింతగా కలవరపడింది. ఎడ్లు బయటకు రాకుండా పనుగడి అడ్డం వేసి బరువుగా అడుగులు వేస్తూ బయటకు వచ్చాడు.

ఆకాశం నిండా కమ్ముకున్న మేఘాలు దూదిపింజాల్లా తేలిపోతున్నాయి. మేఘాల సందుల్లోంచి ఆగి ఆగి కిందకి దిగుతున్న ఎండ సుర్రుమంటుంది. ఎక్కడో ఉరిమిన చప్పుడు. కంచు ముంతను నేలమీద రాస్తున్నట్టు మెల్లిగా వినిపిస్తుంది. పీక్కపోయిన మొహంతో ఆకాశంవైపు దిగులుగా చూస్తూ ఇంటి మొహం పట్టాడు రాములు.

రోడ్డు కింద కాలువ పక్కగానే రాములు పొలం. చెరువులో పావులా మందం నీళ్ళున్నా ఆ పొలంలో ఊటలు సాగుతాయి. ఆయిటి మూనగానే మొదటి మడిని దున్ని మూడెకరాలకు సరిపోను వట్టి వరితుకం పోసి ఆశగా చెరువుకేసి చూస్తున్నాడు. అప్పుడప్పుడూ పడే వాన జల్లులకు నారు ఏపుగా ఎదిగిందికానీ చెరువులోకి చుక్కనీరు రాలేదు.

రెండేళ్ళక్రితం వరకూ ఆ చెరువు ఎండిపోయిన దాఖలాలేదు. మూడు మండలాల ఊర్లని దాటుకుంటూ వస్తున్న వాగుకు అడ్డంగా కట్టిన చెరువు అది. ఎక్కడ ఏమాత్రం కొద్దిగా వర్షం పడినా వరద నీటికే నిండిపోయేది. పక్క ఊర్లు కరువుతో కటకటలాడుతున్నప్పుడు ఈ ఊరు చుట్టూ నీరే! వాగుకు రెండు చెక్‌డ్యాంలు, దారి పొడుగునా కరంటు మోటర్లు వెలిసాక వాగు పారుడు తగ్గి చెరువు ఎండటం మొదలెట్టింది.

పచ్చగా పెరిగిన నారుమడివైపు, నోరు తెరిచిన బీడు భూమి వైపు మార్చి మార్చి చూస్తూ ఇల్లు చేరుకున్నాడు రాములు. నెత్తిమీద ఏదో బరువెత్తుకున్నట్టు కొండంత దిగులు. ఇంట్లోకి అడుగు పెట్టి పద్మను చూసినాక ఆ దిగులు పదింతలయింది. కాళ్ళలో సత్తువ మాయమైపోయింది. అరుగు అంచునే చతికిలపడుతూ 'ఎప్పుడచ్చినవు పద్మా!' అన్నాడు రాములు.

"ఇప్పుడే వచ్చిన. బాగున్నవా బావా!" పలకరింపుగా నవ్వుతూ అన్నది పద్మ. ఆ నవ్వులో ఏదో లోపం కనిపించింది రాములుకు. ఎప్పటిలా కాకుండా అప్పటికప్పుడు కావాలనే బలవంతంగా తెచ్చుకున్న నవ్వులా కనిపించింది.

"ఏం బాగుండుడు పద్మా! నాలుగు పసల్ల నుండి కరువేనాయే! మీరంతా బాగున్నరా!" నీరసంగా అడిగాడు.

"అంతా బాగానే వున్నం. కరువు నీకు ఒక్కనికేనా? దేశమంతటా వున్నది. మా పట్నంల వానలు కొట్టి మీకు కొడుతలేవనుకున్నవా ఏంది? కరువు మాకు కూడా వున్నది" ఆమె మాటల్లో వెక్కిరింత.

"పట్నంల కరువు వేరు, పల్లెల్ల కరువు వేరు. పట్నంల కరువు పడితే తాగుడుగు నీళ్ల మాత్రమే దొరుకయి. మా పల్లెల్ల కరువయితే తాగడుకు నీళ్ల మాత్రమే దొరుకుతయి. ఆడికి - ఈడికి, ఢిల్లీకి అస్మానుకు ఉన్నంత తేడా" నీరసంగా అన్నాడు రాములు చిన్నగా నవ్వుతూ.

అప్పుడే ఇంట్లోకి అడుగు పెట్టింది భూదవ్వ. చెల్లెల్ని చూసి 'ఎప్పుడచ్చినవు చెల్లే' అని దగ్గరికి పోయింది. నవ్వుతూ పైకి ఉత్సాహంగా మాట్లాడుతున్నా లోపల గుబులు మొదలయింది భూదవ్వకు. ఊరు విషయాలు, బంధువుల విషయాలు మాట్లాడుకుంటున్నారు.

రాములు మౌనంగా వింటున్నాడు. పద్మకు కోపమెక్కువ. కట్టెకొట్టెతెచ్చె అన్నట్టు మాట్లాడుతది. ఆ విషయం వాళ్ళు వీళ్ళు అంటుంటే విన్నాడే కానీ చాలా రోజుల వరకూ అనుభవం లోకి రాలేదు రాములుకు. ఎడ్లకు, లాగోడికని ఇరవై వెయిలు అప్పు తెచ్చి ఏడాది పాటుగా ఆపినప్పుడు

అనుభవంలోనికి వచ్చింది.

ఇంటికి వచ్చి అక్కా బావా అని చూడకుండా ఎడాపెడా మాట్లాడింది. బతిమాలి బామాలి మిత్తి అసలులెక్కచేసి మరో ఏడాది పాటు కాయిదం రాసిచ్చాడు. అప్పుడు ఒప్పించడమే కష్టమైంది. ఇప్పుడు ఒప్పించడం ఎలాగో అన్న భయం మొదలయింది.

భూదవ్వ కూడా తక్కునేం కాదుకానీ గాశారం బాగలేక బూడిద కప్పిన నిప్పులా మరుగునున్నది. అయినా అంత సూటి పోటీగా మాట్లాడది. ఆరు నెలలకు వచ్చే ఆపదను ఇప్పుడే పసిగట్టి ముల్లుతో ముల్లు తీసినట్టు మాట్లాడుతది.

చెల్లెలు బాకీ కొరకే వచ్చిందని గుర్తించగానే సల్లవడగొట్టేటట్టు మాట్లాడుతుంది.

"ఏం జెయ్యాలె చెల్లే....కరువుల మన్నువాడ నాలుగు పసల్ల నుంచి కరువేనాయె. పంట పండుడు లేదాయె. ఒకసారి పొట్టల మీద ఎండిపాయె. ఇంకోసారి కరుకు మీదనే ఎండిపాయె. ఒకసారి రాళ్ళ వాననాయె. పంట పండుడు పక్కనబెట్టి ఎరువులకు ఇత్తునాలకు మునిగితిమి. దగ్గరోల్ల దగ్గర బాకీ తెచ్చుడాయె. బావనైతే బెంగటిల్లిండు. కూడు గూడా సక్కగ తింటలేడు..." పద్మ విసుగ్గా మొహం పెట్టింది. బూదవ్వ ముచ్చట ఆపింది.

'అయ్యో! ఏం జెప్పుడు పాడైంది. చెల్లె ఏమనుకుంటుందో ఏమో! బాకీ పాడుగాను. యాడపుట్టక దీని దగ్గర తెచ్చుడాయె. చెడి చెల్లెలింటికి పోవద్దట. అలిగి అక్కింటికి పోవద్దట. ఆరు నెలలకిత్తనని రెండేండ్లు ఆపుడాయె. ఏమని చెప్పాలె.... ఇప్పుడు' అనుకుని గొంతు తగ్గించి అన్నది భూదవ్వ.

"చెల్లె ఏమనుకుంటన్నవో ఏమో! ఎప్పటికప్పుడు బాకీ తీర్చేయాలనుకుంటే యాటగిదేనాయే. నిన్ను మరిది ఎంత బాధపెడుతుండో మామూలు మనిషి గాదు. చెల్లె మనదైతే మరిది మనోడైతడా! ఎట్లనన్న జేసి బాకీ కట్టాలె".

పద్మ పలకలేదు. కనీసం ఓదార్పుగానైనా చూడలేదు. ఆమె కళ్ళలోతుల్లో ఎక్కడో అసహనం.దానిని కప్పుకోవాలని ఆమె చేసిన ప్రయత్నం చూసి భూదవ్వ ప్రాణం జల్లుమంది. బాధల్ని చెబుతుంటే 'అయ్యో యాడికి పోతయితియ్యి' అంటదని ఊహించిన రాములు ప్రాణం గూడా జల్లుమంది.

"పైస పాడుగాను, చూసినావు! పాణమసొంటి సుట్టాన్ని పగజేత్తది. అట్లనా ఇట్లనా అని అంటలేదు సూడు. బాకీ ఎగవెడుతననుకుంటుందా...? ఇద్దరు ఒకటే తల్లికి పుట్టిరి. ఒక్కటే జాగల పెరిగిరి. ఇప్పుడు జూడు. పద్మ కిస్మత్ ఎట్లుంది! మాకిస్మత్ ఎట్లుంది! దేనికైనా బాకీ గావాలె. అయినా ఈ పిచ్చిది వచ్చిరాగానే బాకీ ముచ్చట ఎందుకు తీసింది? ఒకందుకు తీసిందే నయ్యమనుకో! ఆమె గరానికచ్చి అడుగకముందే చెప్పుడునయమయింది' అనుకున్నాడు రాములు.

"చెల్లే! పొద్దుమాపు చాయదాగిందానివి. కోపెడంత చేసుకత్తవుండు" అంటూ ఇంట్లోకి నడిచింది భూదవ్వ. రాములు కూడా నీరసంగా ఇంట్లోకి నడిచాడు.

చెల్లెలు ముఖం సూత్తుంటే భయమయితుంది భూదవ్వకు. అది బయటకు కనడకుండా తొక్కిపెట్టి కొర్రాయిలు ఎగేసి గ్యాస్‌నూనె పోసి పుల్లగీసింది. కొడుకును పిలిచి ఐదురూపాయల బిల్ల ఇచ్చి కోడిగుడ్లు తెమ్మని పంపింది.

భార్యా భర్తలిద్దరూ బయపడ్డంతా అయింది. భోజనాల దగ్గర అప్పుముచ్చట తీసింది పద్మ. గాయికెత్తుకుని అడగడం కాకుండా ఏడ్వడం మొదలుపెట్టింది. భర్త తనను బాధపెడుతున్నాడని, డబ్బు తేనిదే ఇంట్లోకి రావద్దని హెచ్చరించాడని చెప్పింది. ఎన్నడూ లేనిది తనపై చేయి చేసుకున్నాడని కుమిలి కుమిలి ఏడ్చింది.

ఇద్దరూ బాధపడ్డారు. ఎన్నడూ లేనిది కంటికి నీరు తెచ్చుకున్నదంటే ఎంత బాధపెడుతున్నడో అనుకున్నారు. అప్పు తీర్చే మార్గం కనబడలేదు. బయట మూడెకరాల పొలం తప్ప విలువైన ఆస్తులు లేవు. మెడల ఈసమెత్తు బంగారం లేదు.

మరునాడు పద్మను ఒప్పించి 'నేను వచ్చి చెప్తుత నడువు' అని చెల్లెల్ని వెంటబెట్టుకుని వెళ్ళి కాళ్ళుకడుపులు మొక్కి రెండు నెలల వరకు బాకీ తీరుపుతనని మరిదికి నచ్చజెప్పింది. అక్కడి నుండి అటే తల్లిగారింటికి పోయింది. తమ్ముండ్లను, అన్నలను కదిపి చూసింది. అందరూ ఇప్పుడు ఎక్కడియని ఒక్కటే సమాధానం చెప్పిండ్రు. ఇంటికి తిరిగి వచ్చి సోకం పెట్టుకుని ఏడ్చింది భూదవ్వ. రాములుకు తలతిరిగిపోయింది.

బోర్‌బాయిలున్నోల్లు సాగు చేసుకుని నాట్లు వేసుకుంటుండ్రు. బోర్‌లు లేనోళ్ళు బీవాండి, బొంబాయి, సూరత్ పోయిండ్రు. బతుకు భయం కంటే బాకీ భయమే ఎక్కువపట్టుకుంది రాములుకు. రెండు మూడు రోజులు బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. పొలం కుదువబెట్టి ఆరునెలల వాయిదా మీద ముప్పైవెయిల రూపాయలు అప్పుతెచ్చిండు. మూడు రూపాయల మిత్తి. పొలం కుదువ బెట్టాడు కాబట్టి అప్పు చెల్లించకుంటే పొలాన్ని స్వంతం చేసుకునేందుకు అడ్వాన్సుగా వేరు వేరు కాగితాలమీద సంతకాలు తీసుకుని అప్పు ఇచ్చాడు సేటు.

ఈ విషయం తెలిసి నెత్తినోరు లబలబ మొత్తుకుంది భూదవ్వ. పొల్లగాండ్లకు, నాకు ఇంత ఇసంపొయ్యి. ఎన్ని కష్టాలచ్చినా నేను కుదువ బెట్టలేదు. అంత బాకీ ఆరునెలలకే ఎట్ల తేరుపుతవు. ఆరు నెలలకే నీకు పంటపండుతదా! అంటూ ఏడ్చింది.

రాములు మారు మాట్లడలేదు. డబ్బు తెచ్చి ఇంట్లో పెట్టాడు. అనేప్పుడు పటపటా అన్నది కానీ తర్వాత ఆలోచిస్తుంటే భర్త చేసిన పని సరియైనదే అనిపించింది భూదవ్వకు. 'ఎట్లయినా బాకీ కట్టుడేనాయె. ఎప్పుడైతేంది రెండునెలలకు మాత్రం యాడనుండి వత్తయి' అనుకుంది. మరునాడే భర్తను పట్నం పోయి పైసలిచ్చి రమ్మని బస్సు ఎక్కిచ్చింది.

బస్సు ఎక్కిన రాములు పట్నం దాకా పోకుండా నడుమల సిద్దిపేటలోనే దిగిండు. ఒకటికి పదిసార్లు బాగా ఆలోచించిండు. 'ఎట్లయినా సరే! మునిగి నొన్ని మునిగిన. ఇక నిండ మునుగుత. తేలితినాంటే యాడాదిల అందరి బాకీలు తీర్చేస్త. లేకపోతే నా బాకీ ఇంతే వుంది అనుకుని చేనును అమ్మి బొంబాయి మొకాన పోత. ఈసారి తెగారం జేసి చూస్త' అనుకుని బోర్‌వెల్స్ వేసే దుకాణం వద్దకు వెళ్ళాడు.

గంటలో బోర్ బండి సిద్ధమయింది. మరో గంటలో పొలం వద్దకు చేరుకున్నాడు. వెంట బోర్ పాయింట్ చూపించే వ్యక్తి కూడా ఉన్నాడు. బండి యజమానే అతడిని పంపించాడు. అరగంట పొలమంతా తిరిగి ఒకచోటు చూపించి అక్కడవేస్తే వందపేట్ల లోపే పాతాలగంగ పైకి వస్తదని చెప్పాడు. మధ్యాహ్నంపూట బోర్ బండి పని చేయడం మొదలుపెట్టింది. ఎవరో చెబితే నమ్మకుండా చేను వద్దకు పరుగెత్తుకువచ్చింది భూదవ్వ. రాములును చూసి నెత్తంతా కొట్టుకుంది.

"కొంపలగుత్తోడా... ఇగనన్ను వుంచవు. సంపుతవు. నీ ఇల్లు మునగ. చేసేది చెప్పవు. చెప్పేది చేయవు. యాడ ఒకటి పెడుతవు. నేను యాడవడిసత్తు. యాడ ఉరివెట్టుకుందు. అవ్వా... నన్ను ఎందుకుగంటివే అవ్వా.... వావ్వ నువ్వు యాడ వోతివే అవ్వా.....ఈలేకి కొంపలకు నన్ను ఎందుకిత్తివే అవ్వా..." సోకందీసింది భూదవ్వ. రాములు ఒడ్డు మీద మౌనంగా కూర్చున్నాడు.

ఆ సోకం బోరుబండి కరకర సప్పుడులో కలిసిపోయింది. అప్పటికే బోరు వంద పది ఫీట్లకు దిగింది. అంతా రాళ్ళు, మొరము, రెండు గ్యాప్‌లు వచ్చినా నీటి చుక్కరాలేదు. రాములుకు భయం పట్టుకుంది. గుండె దడ మొదలయింది. భార్యను ఓదార్చాలన్నా ధైర్యం చాలడం లేదు.

నూటా ఇరవై ఫీట్ల వద్ద రాయి వచ్చింది. బోర్ డ్రైవర్ పెదవి విరిచాడు. రాములుకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అప్పటికే పదివేయిలు ఖర్చు. 'పోయేటోన్ని సక్కగ పట్నం బోకపోతి. ఎందుకన్న దిగితి. ఇప్పుడెట్ల. బాకీ తీరకపాయె బోరు పడకపాయె. నా నెత్తి మీద శనేశరముంది' అనుకున్నాడు రాములు.

బూదవ్వ ఏడుపును ఆపి వెర్రి చూపులు చూస్తోంది. బోర్ చుట్టూ పిచ్చివాడిలా రెండు మూడు చుట్లు తిరిగి ఒడ్డుమీద కూర్చున్నాడు రాములు. మరో ఐదు ఫీట్లు దించి ఆపుచెయ్యమని డ్రైవర్‌కు చెప్పాడు. భూదవ్వ వైపు చూడాలంటేనే భయమేస్తుంది రాములుకు.

రెండు ఫీట్లు దిగినాక సుయ్యిమని చప్పుడు వచ్చింది. రాడ్‌తోపాటు నీళ్ళు పైకిచిమ్మాయి. మామూలు ధార కాదు. కరెంట్ మోటార్‌తో నీళ్ళను పైకెత్తుతున్నంత ధార. క్షణాల్లో నీరు కాలువలు కట్టింది. ఉల్కి పడ్డాడు రాములు. నమ్మలేనట్టుగా  బండివద్దకు పరుగెత్తాడు.

నీళ్ళు తన్నుకు వస్తున్నాయి. దానిలో తడుస్తూ చిన్నపిల్లగాడిలా నీటి చుక్కలను దోసిట్లో పట్టుకుని అపురూపంగా చూస్తున్నాడు. తొలకరి జల్లులో తడుస్తున్నట్టు పులకరింపుగా ఎగిరి గంతేసాడు రాములు. భూదవ్వ కూడా నిజంగా గంగ దేవత ప్రత్యక్షమైనట్టు ఆశ్చర్యంగా చూసింది. ఇంత నీటిని తానెన్నడూ చూడలేదని, రాడ్‌ను కిందకి దిగనీయకుండా ఎగజిమ్ముతుందని చెప్పి మోటార్‌ను ఆపు చేసాడు డ్రైవర్.

మరో పదివెయిలు అప్పుతెచ్చాడు రాములు. 'బోర్ సక్సెస్' అవగానే అప్పుపుట్టడం తేలికయింది. భూదవ్వ కూడా అడ్డుచెప్పలేదు. నాలుగురోజుల్లో నలభై వెయిల ఖర్చుతో మోటార్ పొలంలోనికి నీళ్ళను ఎగజిమ్మింది. కరెంట్ మీటర్ సాంక్షన్ కాలేదు కానీ, తాను నెలరోజుల్లో మీటర్ తెస్తానని, అంత డైరెక్ట్‌గా పోల్ నుంచి వైర్ వేసుకొమ్మని చెప్పాడు హెల్పర్. సాంక్షన్ ఖర్చులకని ఐదు వెయిలు తీసుకున్నాడు

ఊరిలో అక్కడక్కడా వాగులకి, ఒర్రెలకి పొలాల్లో మోటార్లున్నాయి. రాములు పొలం వున్న ఏరియాలో బోర్ బావులు లేవు. వారం రోజుల్లో దున్నడం పూర్తి చేసి నాటును గుత్తకిచ్చాడు. బీడు భూమి కాబట్టి తొందరగనే వరి పచ్చబడింది. నెల రోజుల్లోపు మందు చల్లి కలుపుతీసాడు.

చుట్టూ బీడు పొలాల మధ్య పచ్చని పంటచేను ఊరి వారందరి చూపులకూ, మాటలకూ ఆలోచనలకూ కేంద్ర బిందువయింది. చుట్టూ వున్న పొలాల వాళ్ళు చెరువుకు ఆశపడకూడదని, ధైర్యం చేసి తాము కూడా బోర్ వేయించుకోవాలని ఆలోచిస్తున్నారు. పొలంలో బెదురు బొమ్మను పెట్టాడు రాములు.

వరి పైరు పొట్టకు వచ్చింది. చెరువులకు నీళ్ళు రాలేదు. చెరువు వైపు చూసేవారికి కరువులాగే ఉంది. బోర్‌మోటర్ల వద్ద పచ్చదనం తాండవమాడుతుంది. భార్యా భర్తలిద్దరూ ఏ రాత్రి పూటో తప్ప పొలం వద్ద నుండి కదలడం లేదు.

రెండు నెలల వాయిదా నిండగానే పద్మ అప్పు కొరకు వచ్చింది. ఏపుగా పెరిగిన మూడెకరాల పొలం, నీళ్ళను ఎత్తిపోస్తున్న మోటరు, భార్య భర్తల మొహాల్లో ఆత్మవిశ్వాసం చూసాక బాకీ అనాపైసతో తీరుస్తారన్న నమ్మకం కుదిరింది. తనే వారికి ధైర్యం చెప్పి, తన భర్తకు సర్ది చెప్పుతానని రెండురోజు లుండి వెళ్ళిపోయింది.

ఒకనాడు కరెంటు రాలేదు. మామూలుగా అప్పుడప్పుడూ పవర్‌కట్ అవుతుంది. అలాగే అయిందనుకున్నాడు రాములు. కానీ కరెంట్ రెండు రోజుల వరకూ రాలేదు. పెద్దూర్ సబ్‌స్టేషన్ లో ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయిందని కొందరు, రామగుండంలోనే ఏదో జరిగిందని కొందరు రక రకాలుగా అంటున్నారు. రాములుకు బెంగ పట్టుకుంది. చాలా రోజుల నుంచి కరెంటు మోటార్ల న్నోల్లను విచారించాడు. ఎప్పుడు వస్తుందో ఎవరూ సరిగ్గా సమాధానం చెప్పలేదు.

మంచె మీద కూర్చుండి ఆరిపోతున్న పొలంవైపు, అప్పుడప్పుడే పొట్ట విప్పుకుంటున్న వరికర్రల వైపు దిగులుగా చూస్తుండిపోయాడు రాములు. భూదవ్వకు కూడా ఏటూ తోచడం లేదు. సద్ది గట్టుకొని వచ్చి పనివున్నా లేకపోయినా పొలం వద్దనే వుంటుంది. రెండు రోజులకే భూమి పర్రెలు పారుతుంది.

పైరు పొట్టతో వున్నప్పుడే నీరు బాగా కావాలి. అప్పుడుగానీ నీరు అందకపోతే పైరు దెబ్బతింటుంది. గింజలన్నీ పొల్లుపోతాయి. అదే విషయం వారిని కలవరపరుస్తుంది. ఒకరినొకరు ఓదార్చుకోవడం తప్ప చేసేదేం లేక దిగులుగా వున్నారిద్దరూ.

మూడో నాడు కరెంటు వచ్చింది. రాములుకు ప్రాణం లేచివచ్చి నట్టయింది. బోర్ పైపులోంచి నీరు వేగంగా పొలంలోకిపారుతుంటే జీవదాతువేదో తమ నరాల్లోకి పారుతున్నట్టుగా పులకరించి పోయారిద్దరూ. చిన్నపిల్లల్లా నీటిలో ఆడుతూ కాలవలు కట్టి నీరును పొలాన్నంతా పారించారు. ఆకుపై తెల్ల తెల్లని మచ్చలు కనిపించడంతో పురుగు మందును స్ప్రే చేసాడు రాములు. ఆ రోజు రాత్రే హెల్పర్ ఇంటికి వచ్చాడు.

"కరెంటు ఉత్పత్తి తగ్గింది రామన్నా! రోజు తొమ్మిది గంటలే ఇస్తరట. పైగా కరెంటు బిల్లు కూడా పెరిగింది..." అంటు అసలు విషయం మొదలు పెట్టాడు. "అవుగనీ రేపు కరెంటు సూపర్‌వైజర్లు వత్తుండ్రు. దొంగ కనెక్షన్లుంటే దొరుకవట్టి జురుమాన ఏత్తరు. మీకు మీటరు లేకపాయె. మీది కూడా దొంగ కనక్షనే" అన్నాడు.

"అదేంటిది? నీకు ఐదు వెయిలిత్తి గదా! నువ్వు సాంక్షన్ జేపిచ్చుకు రాకపోతే నేనేం జెయ్యాలె" అన్నాడు రాములు తలబిరుసుగా. తను ఏమాత్రం మెత్తగా మాట్లాడినా తనదే తప్పంటాడన్న ఆలోచనతో నొక్కి మాట్లాడాడు. మధ్యలో ఇటువంటి సమస్య ఎదురవుతుందని అతడు ఊహించ లేదు. భయంతో వణుకు మొదలయింది.

"మన ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ అంతగాలేదు. అది మార్చేవరకూ కొత్త కనెక్షన్లు ఇవ్వరట. అది మారాలంటే రెండు నెలలపైనే పడుతుంది. ఎలాగు కనెక్షనిస్తే కరెంటు బిల్లు ఐదు వెయ్యిలు

కట్టకపోదువా? అదే బిల్లు కట్టిన అనుకో. ఇప్పుడు ఐదు వందలియ్యి. వాళ్ళు ఇటువైపు రాకుండా చూస్తాను. కాదంటే నీ ఇష్టం. అరెస్టులు, పోలీసులు, కేసులుంటాయి'' బెదిరిస్తున్నట్టుగా చెప్పాడు.

రాములుకు భయం మరింత ఎక్కువయింది. హెల్పర్ చెప్పిన లాజిక్ నిజమే ననిపించింది. 'పంట పండేవరకు ఎలాగూ బిల్లు చెల్లిస్తుంటిగదా! ఇప్పుడు బిల్లు లేకుండా పంట పండినట్టే. అదే ఇదనుకుంటాను' అనుకున్నాడు. ఊరంతా తిరిగి అప్పు తెచ్చి ముట్టజెప్పాడు. 'నీకేం భయంలేదు' అని భరోసా ఇచ్చి వెళ్ళాడు హెల్పర్.

వరి పైరు ఈనడం మొదలు పెట్టింది మళ్ళీ ఏదో రోగం వస్తే వాళ్ళను వీళ్ళను అడిగి ఏదో పురుగు మందు స్ప్రే చేసాడు. ఎరువుల మందుల దుకాణంలో ఖాతా తెరిచాడు. కరెంటు కోత మొదలయింది. అర్ధ రాత్రిపూట ఎప్పుడు కరెంటు వస్తదో, ఎప్పుడు పోతదో తెలియక మంచెనే ఇల్లుగా చేసుకున్నాడు రాములు. ఎప్పుడు కరెంటు వస్తే అప్పుడు మోటార్ పెడుతున్నాడు.

పైరు పూర్తిగా ఈని కాయగొనడం మొదలయింది. బెరికి కర్రలు ఒక్కొక్కటి అప్పటికే ఎర్రబడ్డాయి. ఒక రకం కాయగొంటే మరో రకం ఈనుతుంది. ఇంకా కొన్ని కర్రలు అప్పుడప్పుడే పొట్ట విచ్చుకుంటున్నాయి. విత్తనాలు కల్తీ కావడమే అందుకు కారణమని గ్రహించాడు రాములు. అప్పుడు చేసేదేం లేక మడిలో దిగి జోలెకట్టుకుని ఎర్రబడ్డ బెరికి గొలుకల్ని కోసుకోవడం మొదలెట్టారు. బురదలో కర్రల్ని పాపుకుంటూపోవడం, మరో కర్రకు కొడవలి ఆనకుండా కొయడం కష్టమయింది. సగం గింజలు బురద పాలయ్యాయి.

గింజలు కాయగొంటుండగా రాములు పొలం చుట్టూ వున్న వాళ్ళు బోర్ మోటార్లను తెచ్చారు. ముగ్గురి బోర్లు సక్సెస్ అయ్యాయి. ఇద్దరివి మాత్రం నీళ్ళు రాలేదు. అందులో ఒకరికి మరోచోట వేస్తే నీళ్ళు పడ్డాయి. మరో వ్యక్తికి మాత్రం మూడు చోట్ల వేసినా చుక్క నీరు రాలేదు.

మూడు నాలుగు రోజుల్లో మోటార్లు అమర్చారు. ఎవరి వద్ద ఎంత తీసుకున్నాడో కానీ నలుగురికీ డైరెక్టు కనెక్షన్లు ఇచ్చాడు హెల్పర్. చుట్టూ నాలుగు బోర్లు నడవడం మొదలు పెట్టగానే రాములు బోర్ వెనక్కి తగ్గింది. పైపులోంచి వచ్చే నీటి వేగం సగానికి తగ్గింది. ఇప్పుడు మూడెకరాల పొలంకు నీరు సరిపోవడం లేదు.

వారం రోజుల్లో నీటి వేగం మరింత తగ్గింది. ఎకరం పొలం వెనక్కువచ్చింది. చుట్టూ వున్న బోర్లు తన బోర్ వైపు వస్తున్న ఊటను అడ్డుకుంటున్నాయని గ్రహించాక రాములుకు వెన్నులో చలి మొదలయింది. 'ఇప్పడే ఇలా వుంది. వేసవిలో అయితే ఒక్క చుక్క నీరు వచ్చేటట్టులేదు. కోతలు పట్టగానే మోటార్‌ను బయటకు తీసి మరో యాభై పీట్లు బోర్ వెయ్యాలను కున్నాడు రాములు.

నీరు మూడెకరాలు ఒక్క రోజులో తిరగలేని స్థితి రాగానే కాలువలు పాపి వరుస తడితో ఎకరం పొలంను ఒక రోజు, ఎకరం పొలంను ఒకరోజు తింపడం మొదలెట్టాడు. ఎందుకంటే కాయగొనే సమయంలో నీళ్ళు అందకపోతే గింజలు పీలవడి బరువు తూగవు. అంతా పొల్లుగా మారుతుంది.

పొలంకు నీళ్ళు కట్టడంతోటే అవస్థలు పడుతున్న రాములుకు లోడ్ ఎక్కువై ఊరిలోని ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మరిన్ని కష్టాలు మీదపడ్డాయి. వెంటనే హెల్పర్‌ను కలిసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ తేవాలని, లేదంటే ఒక్క గింజ కూడా చేతికి రాదని చెప్పాడు.

హెల్పర్ అతడివైపు అదోలా చూస్తూ "ట్రాన్స్‌ఫార్మర్ దేముంది! ఇరవై నాలుగ్గంటల్లో తెప్పియ్యచ్చు. కానీ ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తో నడిచే మోటార్ల బిల్లు చాలావరకు డ్యూ వుంది. నయాపైస బాకీ లేకుండా చెల్లిస్తే కాని కొత్తది ఇయ్యరు. ఒక్కొక్క మీటర్‌ది వేల రూపాయల బకాయి వుంది. అది ఎవరు కడతరు" అన్నారు.

రాములుకు కోపం, ఏడుపూ రెండూ ముంచుకొచ్చాయి. "ఎవరు బిల్లు కట్టకపోతె వారికి కనెక్షన్ కట్ చెయ్యాలేగాని కట్టినోల్లయి, కట్టనోల్లతో అందరివీ లెంక బెట్టుడెందుకు?" అన్నాడు రాములు.

"మన చేతులు మన నెత్తి మీదనే పెడుతరు. కట్టనోల్లకు మనమే బెదిరిచ్చి చెప్పాలె. నచ్చచెప్పి బిల్లు కట్టియ్యాలె" అన్నాడు హెల్పర్.

వాళ్ళ, వీళ్ళ దగ్గరికి తిరిగాడు రాములు. ఎవరూ వినలేదు. పైగా వాళ్ళ వరి నాట్లు ముందుగానే పడ్డయి. వరి కోతకు వచ్చింది. మరో నెల, రెండు నెలల వరకు నీరు అవసరంలేదు. అప్పటి వరకు చూద్దాంలే అన్నారు. రాములు పరిస్థితి మాత్రం కుడిదిలో పడ్డ ఎలుక మాదిరి అయింది.

మూడు రోజుల వరకూ ఎదురుచూసాడు. చీమ కూడా కుట్టనట్టు రైతులు, ఏమీ పట్టనట్టు హెల్పర్ వుండి పోవడంతో చేసేదిలేక డీజిల్ ఇంజన్‌ను కిరాయికి మాట్లాడి, చాలా దూరంలో వున్న ఒక మడుగు నుంచి పైపులు చాపి నీరు తెచ్చి మూడు తడులను అందించి వదిలి పెట్టాడు.అప్పటికి కర్ర పూర్తిగా ఎర్రబడింది. బాధతో రాములు కళ్ళు కూడా ఎర్రబడ్డాయి. ఒక పెద్ద యజ్ఞం పూర్తయినట్టు భుజాల మీది బరువేదో దిగిపోయినట్టు తేలిగ్గా ఊపిరిపీల్చుకున్నాడు.

వారం రోజుల్లో వరి కోత పూర్తయింది. పడుగు పెట్టి ట్రాక్టర్‌తో బంతి తిప్పి ఎగబోసి వడ్ల రాసి చేసి కల్లం మీదనే అమ్ముదామని చూసాడు రాములు. కోమట్లు ఎవరూ కొనమని చెప్పారు. అప్పుతెచ్చిన సేటు మాత్రం సగానికి సగం ధర తగ్గించి చెప్పాడు. నాలుగు రోజులాగితే వాళ్ళే నా ఇంటి చుట్టూ తిరుగుతారని వడ్లను సంచుల్లో నింపి ఇంటికి చేరవేసాడు రాములు. భయపడ్డట్టు కాకుండా వడ్లు అనుకున్న దానికంటే ఎక్కువగానే పండాయి. మొత్తం వందా పది బస్తాల ధాన్యం పండింది. తృప్తిగా నవ్వుకున్నాడు రాములు.

కోతలు పూర్తయి నెల గడిచింది. వడ్లు కొంటామన్న సేట్లే కరువైపోయారు. అంతవరకు కొన్న వడ్లే తమ వద్ద నిలువవున్నాయని, గోదాముల్లో కూడా పాత నిలవలే పేరుకుపోయాయని వద్దంటున్నారని తెలిసింది.

రాములుకు ఇప్పుడు కొత్త సమస్య మొదలయింది. ఇంతకుముందు పంటలు లేక కరువైతే ఇప్పుడు ఎక్కువ పంటపండి, కరువు మొదలైంది. బాకీల భయం, పెరుగుతున్న వడ్డీల భయం వెన్నులో వణుకు పుట్టిస్తుంటే పండిన పంట ఇంట్లోనే వుండి రాములును కృంగతీస్తుంది. మానసికంగా బలహీనుడైపోయాడు. గుండెను చిక్కబట్టుకుని అప్పు ఇచ్చిన సేటు వద్దకు వెళ్ళాడు రాములు. అంతకు ముందు వడ్లున్నయా, వడ్లున్నాయా అని ఇల్లిల్లూ తిరగినోడే అతడు. రాములును చూసి నొచ్చుకుంటున్నట్టుగా అన్నాడు.

"అమ్ముడు పోయేదుంటే కొనమా రాములూ! పోయినేడూ, అంతకుముందూ లేవీ బియ్యం పూర్తయి ఈ టైంకు లారీ లోడు బియ్యాన్ని వేరే రాష్ట్రాలకు పంపేటోల్లం. ఇప్పుడు అక్కడి నుంచే

మనకు వస్తున్నాయి. చైనా బియ్యమట చూసినావు! మన బి.పి.టి. బియ్యం కంటే మంచిగున్నయట. ఆరు వందల యాభైకే కింటలు బియ్యం అమ్ముతున్నరట. ఇగ మన బియ్యాన్ని ఎవరు కొంటరు" అన్నాడు.

"అరే... ఇక్కడనే మస్తు పంటలు... ఆదేశం నుంచి మనం తెప్పించ్చుకునుడేంది?" ఆశ్చర్యంగా అడిగాడు రాములు.

సేటుకు పూర్తిగా తెలుసు. చెప్పినా రాములుకు అర్థం కాదని ఊరుకున్నాడు. పనిలోపని బాకీ పైసలు మిత్తి అసలు కూడా గుర్తు చేసాడు. తక్కువ ధరకు వడ్లను అమ్ముతానన్నా తీసుకోలేదు. బాకీ చెల్లించకపోతె పొలానికే ఎసరు వస్తుందని మాత్రం పరోక్షంగా హెచ్చరించాడు.

తను బాగానే కష్టపడ్డాడు. అన్ని కష్టాలను ఎదుర్కొన్నాడు. పంటను బాగానే పండించాడు. ఎక్కడ ఏం జరిగిందో కానీ తన పంట తన ఇంట్లోనే వుంది. ఇప్పుడెలా...? దీన్ని కరువు అనాలా లేక ఇంకేమైనా అనాలా...? ఆలోచిస్తూ ఇంటికి వచ్చాడు రాములు.

నెత్తిన పిడుగు వడ్డట్టు అప్పుడే పద్మ ఉత్తరం అందింది. పంట అమ్మి ఉంటారని, వారం రోజుల్లో తాము వస్తున్నామని, డబ్బు రడీ చేయమని దాని సారాంశం. మొదలు నరికిన చెట్టులా కూలబడి పోయాడు రాములు ●